సీఎం జగన్‌తోనే పేదల భవిష్యత్తు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభం
- ఇంటింటికీ కదిలిన గృహ సారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు



మండపేట వాసుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



రామచంద్రపురంలో లబ్ధిదారునితో మాట్లాడుతూ వివరిస్తున్న మంత్రి వేణు

మండపేట: పేదల భవిష్యత్తు సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముడిపడి ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సంక్షేమ పాలన కొనసాగించుకునేందుకు జన నేతనే మరలా సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం మండపేట 18వ వార్డులోను, తాపేశ్వరం గ్రామంలోను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, గృహ సారథులతో కలసి ఎమ్మెల్సీ తోట ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా?, పాలన ఏవిధంగా ఉంది ?, జగన్ పరిపాలన నచ్చిందా, లేదా ?, గత టీడీపీ పాలనకు వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు వ్యత్యాసం ? గురించి ఆయన స్థానికులను అడిగి వారి అభిప్రాయాలను బుక్‌లెట్‌లో నమోదు చేశారు. ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను స్థానికులకు అందజేయడంతో పాటు స్థానికుల కోరిక మేరకు స్థానికుల ఇళ్లకు, సెల్‌ఫోన్‌లకు సీఎం వైఎస్ జగన్ చిత్రంతో రూపొందించిన స్టిక్కర్లను స్వయంగా ఎమ్మెల్సీ తోట అంటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 20 వరకు గృహ సారథులు తమ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి పేదల అభ్యున్నతి ధ్యేయంగా వైఎస్సార్ ప్రభుత్వ పాలన గూర్చి, ఓర్వలేక ప్రతిపక్షాల చేస్తున్న దుష్ప్రచారాన్ని వివరిస్తారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ నాయుడు లక్ష్మీసౌజన్య, పార్టీ అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, జేసీఎస్ కన్వీనర్లు యరమాటి వెంకన్నబాబు, బందెల సాయిరాం, ఎంపీటీసీ సభ్యులు పిల్లా లక్ష్మీ, పంపన లక్ష్మీ, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, కొప్పిరెడ్డి ప్రసాద్, ముక్కా దాలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రాయివరం జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో పార్టీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు



గొల్లపాలెంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు పంచుతున్న గృహసారథులు, పార్టీ నాయకులు

చేసిన మేలును చెప్పేందుకే

రాయవరం: ప్రజలకు చేసిన మేలును చెప్పేందుకే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. రాయవరంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు నూతనంగా నియమించిన గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రంలోని ప్రశ్నలను అడిగి, ప్రజల నుంచి స్పందన తీసుకున్నారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బారామారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, వైఎస్సార్‌సీపీ నేతలు తాడి రామచంద్రారెడ్డి, తమలంపూడి గంగాధరరెడ్డి, పడాల కమలారెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి తదితరులు అంగరలో ఇంటింటికీ పర్యటించారు. 19 గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటి వెళ్ళి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. వారి సమ్మతిపై మంచి తాలూకు స్టిక్కర్‌ను ఇంటికి అతికించారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, టేకి, మాచర, వడ్లమూరు, అద్దంకివారిలంక, కేదారిలంక తదితర గ్రామాల్లో పర్యటనలు సాగాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, గుణ్ణం భాను ప్రసాద్, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ కన్వీనర్ వీధి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ వాసా కోటేశ్వరరావు, 19 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ఉపయోగించుకోవడంలో ప్రజలలో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకురాగలమని పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, కుయ్యేరులో జరిగిన కార్యక్రమంలో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి కృష్ణమూర్తి, నెల్లి బ్రహ్మాజీ, ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి పద్మ, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, వడ్డి శ్రీను, తోట కృష్ణ, మాత నాగరాజు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు సీఎం జగన్

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రారంభించిన మంత్రి వేణు

రామచంద్రపురం: 'చెప్పిందే చేస్తాను, నేను ఉన్నాను... నేను విన్నాను అని పాదయాత్రతో భరోసాను కల్పించి నవరత్నాల ద్వారా చెప్పిందే చేసి చూపించిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 18 వార్డు మధ్యనగర్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహసారథులు, పార్టీ సచివాలయ కన్వీనర్లతో కలసి ప్రారంభించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలసి వారికి పథకాల లబ్ధిని వివరించి జగనన్నకు మీ మద్దతు కావాలని కోరారు. మంత్రి వేణు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి, ఏ నాయకుడు చేయని విధంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించి మీము ఇచ్చిన పథకాలు అందాయా లేదా? అని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకునే దమ్మున్న నాయకుడు జగన్ అని మంత్రి వేణు అన్నారు. నవరత్నాల్లో 98 శాతం అమలు చేసిన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు అనే జలగలు ప్రజల వద్ద నుంచి పీల్చుకుని తింటే ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం కులం, మతం, పార్టీ ఇవేమి చూడకుండా అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమచేస్తున్నారని వివరించారు. గతంలో వర్గాలు, కులాల పేరుతో చంద్రబాబునాయుడు విడదీసి కుమ్ములాటలు పెడితే ప్రస్తుత సీఎం నా బీసీలు, నా ఎస్సీలు, నా మైనార్టీలు అంటూ వారి కష్టాలను తీర్చుతూ అక్కున చేర్చుకుంటున్నారని మంత్రి వేణు అన్నారు. ఇంటింటికీ వెళ్లి మేము చెప్పింది చేశాం అని చెప్పే సాహసోపేతమైన భారీ కార్యక్రమాన్ని ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే చేయగలుగుతుందని మంత్రి వేణు స్పష్టం చేశారు. వాక్ ది టాక్ అన్నట్లు స్వాతంత్ర్యానంతరం ఎక్కడా లేని విధంగా కులమతాలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా మనం ఏదైతే మాట్లాడతామో.. దాన్నే ఆచరించాలనే సిద్ధాంతంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు వెళుతుందని గర్వంగా చెబుతున్నామని మంత్రి అన్నారు. ఎక్కడా ఒక్క రూపాయి లంచం లేకుండా అర్హత ప్రమాణాల్లో పేదలను ఎక్కువగా చేరుస్తూ వారి సాధికారత దిశగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ పాలనలను పోల్చి చెబుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో కరపత్రాలను అందించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని మద్దతు కోరతామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ పార్టీ నేతలు మేడిశెట్టి శేషారావు, కంచుమర్తి బాబూరావు, పెంటపాటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పార్టీ నాయకులు కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రీవెన్స్ పోర్టల్ ప్రారంభం

రాయవరం: రైతుభరోసా పోర్టల్ నందు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ పోర్టల్ ఓపెన్ చేసినట్టు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసాకు అర్హత ఉండి, రైతు భరోసా పొందలేని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే రైతు భరోసా పొందుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు రైతు భరోసా పొందడానికి అర్హులన్నారు. ఇప్పటివరకు ఎవరైనా రైతు భరోసా పొందని కుటుంబంలో కొత్తగా భూమిని కొనుగోలు చేసి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్నట్‌లెతై, వారు కూడా వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. రైతు భరోసా కేంద్రానికి సమీప రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన రాజ్యలక్ష్మి వారి జాతర

కపిలేశ్వరపురం: పడమరఖండ్రిక గ్రామంలో కొలువైన శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులుగా ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామానికి చెందిన ఆడ పడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వహణకు సహకరించిన గ్రామస్తులకు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోలపల్లి గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు చీకట్ల సుందరి, జగతా వీరబాబు, కొమ్ము సత్యవతి, కర్రి జయలక్ష్మి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి వైద్యానికి సాయం అందిస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: అంగరలోని ముస్లిం పేద కుటుంబానికి చెందిన ఓ చిన్నారి తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. వ్యాధి నిర్ధారణ క్లిష్టతరమైన నేపథ్యంలో చిన్నారి తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ జిట్టాల కాశీ విశ్వనాథం, వలంటీర్ మత్సా సతీష్ స్నేహితులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. నగదును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా శుక్రవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టా అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, అంగర, పడమర ఖండ్రిక సర్పంచులు వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ చోరీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం రాత్రి కంప్యూటర్ దొంగిలించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలిశెట్టి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన తరువాత గది తలుపులు బద్దలు కొట్టి ఉండటం గమనించిన ప్రధానోపాధ్యాయుడు పాత కంప్యూటర్ దొంగిలించినట్లు గుర్తించారు. అయితే చాలా ఏళ్ల క్రితం దాతలు సమకూర్చిన ఈ కంప్యూటర్ ప్రస్తుతం సుమారు రూ. 5 వేలు విలువ చేస్తుందని అందువల్ల పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ముస్లిం సోదరుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ముస్లిం యువకులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లిం విద్యార్థినీవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలుపెడతామని తెలిపారు. మైనారిటీలైన ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం యువకులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం సీఐగా కొండయ్య



ముమ్మిడివరం: ముమ్మిడివరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.కొండయ్య నియమితులయ్యారు. ఇప్పటివరకూ సీఐగా పని చేసిన ఎం.జానకిరామ్ వ్యక్తిగత అభ్యర్థనతో వీఆర్‌కు వెళ్లారు. కొండయ్య ఏలూరు నుంచి బదిలీపై ముమ్మిడివరం రానున్నారు. రెండు మూడు రోజుల్లో ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో కొండయ్య ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



రాయవరం చర్చిలో క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతున్న పాస్టర్ అనిల్‌కుమార్



తోటపేట కతోలిక జయజేసు చర్చి విశ్వాసుల శిలువ యాత్ర

రాయవరం: మండలంలోని గుడ్ ఫ్రై డే ప్రార్థనలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాయవరంలో అపొస్థలిక్ ప్రేయర్ హౌస్‌లో క్రీస్తు శ్రమలను ధ్యానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ గొడుగు అనిల్‌కుమార్ క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీస్తు లోకరక్షణ కోసం తనను తాను బలిగా అర్పించారన్నారు మండలంలో పలు చర్చిల్లో ఏసును స్తుతిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక గీతాలను ఆలపించారు. మండలంలోని పసలపూడి, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కపిలేశ్వరపురంలో విలియం మేయర్ మిషనరీ హాస్పిటల్ నుంచి గ్రామాల్లో ఏసు కీర్తనలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ఏసు, ఆయన అనుచరుల పాత్రలను ధరించి శిలువను మోస్తూ ముందుకు సాగారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి క్రైస్తవ ప్రబోధకులు మాట్లాడుతూ శిలువ వేసినపుడు ఏసు పలికిన క్షమాగుణం, బాధ్యత, ప్రేమ, పాపపు ఒప్పుకోలు, దయా తదితర సద్గుణాలను వివరించారు. అంగర, తాతపూడి, మాచర, తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు.

తోట పేటలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట కతోలిక జయజేసు చర్చి పాస్టర్ సీహెచ్ సురేష్ ఆధ్వర్యంలో వేలమంది క్రైస్తవులు తిర్లంపేటలోని చర్చి నుంచి తోటపేట చర్చి వరకు శిలువ యాత్ర నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెల్లలో ఏసు మహిమాలయ బాప్టిస్టు చర్చిలో పాస్టర్లు రెవరెండ్ కె. శామ్యూల్‌ప్రసాద్, రెవరెండ్ కె.బాయ్‌ల ఆధ్వర్యంలో క్రీస్తు సందేశం అందజేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు, యువజనులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ చర్చిలో డాక్టర్ రెవరెండ్ జాన్‌బెన్నీ ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు.

ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీలో 100 ముస్లిం కుటుంబాల చేరిక



ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లింలు

మండపేట: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, వెలగతోడు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన వందకు పైగా ముస్లిం కుటుంబాల వారు ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తాపేశ్వరంలోని ఎమ్మెల్యే అతిథి గృహ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కులమత వర్గాలు, రాజకీయాలు ఏవీ చూడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన షేక్ మీరా సాహెబ్, షేక్ సత్తార్ సాహెబ్, మహ్మద్ ముఖారం, పఠాన్ బహదూర్, షేక్ మీరా, షేక్ వల్లీ, షేక్ నాగూర్ తదితరుల నేతృత్వంలో అధిక సంఖ్యలో ముస్లింలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనకు, ఎమ్మెల్సీ తోట నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఆయా గ్రామాలకు చెందిన వారు నమాజ్ చేసుకునేందుకు వీలుగా తాపేశ్వరంలో మసీదు నిర్మాణానికి స్థలం సమకూర్చాలని ముస్లింలు కోరగా ఎమ్మెల్సీ తోట సానుకూలంగా స్పందించారు. పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, గారపాటి అశోక్‌కుమార్, పంపన పద్మారావు, నాగిరెడ్డి రాంబాబు, బూర చిన్న, బొగ్గవరపు రామలక్ష్మి, దాసరి లాజరు, గ్రంధి సూరిపండు, ముత్యాల సత్యనారాయణ, చింతలపూడి మల్లిబాబు, చిన్ని గంగాధర్, కొప్పిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, మధ్యమధ్యలో చెదురుమదురు వర్షాల కారణంగా వరి పంట పలు రకాల వ్యాధులు, తెగుళ్ల బారిన పడుతుందన్నారు. మండల గ్రామాల్లో పంటపై ఎక్కడైన రైతులు తెగుళ్ల లక్షణాలు గమనిస్తే సమీపాన ఆర్బీకేలో సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హసన్‌బాదలో భూరక్ష పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: భూ హక్కుదారుకి ఎంతో మేలు కలిగే వైఎస్సార్ జగనన్న భూ రక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని హసన్‌బాదలో భూ రక్ష పథకంలో భాగంగా సర్వే ఆధారంగా రాళ్లు వేసి రాళ్ల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. వీఆర్వో ఎం.సూర్యకుమారి, వీఆర్ఏ పావులూరి చంటి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి మెడలో పుస్తెలు చోరీ



ఆగంతకుడు తెచ్చిన చీర

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామ దేవత బులి బాపనమ్మ వారి ఆలయంలో అగంతకుడు 10గ్రాముల పుస్తెల తాడు చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారికి చీరలు పెట్టే నెపంతో అగంతకుడు గురువారం మధ్యాహ్నం ఈ చోరీకి పాల్పడినట్టు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఆలయానికి తాళాలు వేసి ఉండడంతో చీరలను అమ్మవారికి వేస్తున్నట్లుగా నటిస్తూ కర్రతో అమ్మవారి మెడలోని సూత్రాలను తెంపుకు పోయినట్లుగా సమాచారం. అగంతకుడు పల్సర్ మోటార్ సైకిల్‌పై వచ్చినట్టు ప్రత్యక్ష సాక్షి ద్వారా తెలుస్తోంది. ఆలయం గురించి అన్ని విషయాలు తెలిసిన వ్యక్తే ఈ చోరీకి పాల్పడినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు రాయవరం ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బులి బాపనమ్మ అమ్మవారు

ఈస్టర్ వేడుకలకు ఏర్పాట్లు



శ్మశానవాటికలో పొదలు తొలగిస్తున్న సిబ్బంది

మండపేట: ఈస్టర్ వేడుకలకు మండలంలోని ఏడిద శ్మశాన వాటికను ఆ పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం శుక్రవారం పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన అనంతరం పునరుత్థానుడైన రోజున ఈస్టర్‌గా భావిస్తారు. స్వర్గస్తులైన తమ ఆత్మీయులు ఏసుక్రీస్తు వారి ప్రేమలో ఆశీర్వదింపబడాలని ఆశిస్తూ సమాధులను పూలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఆదివారం ఈస్టర్ వేడుకల కోసం సర్పంచ్ ఆశీర్వాదం శ్మశాన వాటికలోని పొదలు, తుప్పలను సిబ్బందితో తొలగించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



భవన నిర్మాణ మేస్త్రీకి చెక్కు అందజేస్తున్న కరుణాకర్, భవానీ శంకరం

మండపేట: భవన నిర్మాణంలో నాణ్యతకు, దీర్ఘకాలం మన్నికకు భారతి సిమెంట్ పేరొందిందని భారతి సిమెంట్స్ మార్కెటింగ్ సీనియర్ అధికారి ఎం.కరుణాకర్, టెక్నికల్ సర్వీసెస్ సీనియర్ అధికారి ఎన్.భవానీశంకరం అన్నారు. మండపేట ఏడిద రోడ్డులోని గుత్తుల అయ్యప్పకు చెందిన ఏఎస్ ఆర్ ఎంటర్‌ప్రైజెస్ షాపులో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ భవన నిర్మాణాల్లో నాణ్యమైన సిమెంట్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఆధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతోందన్నారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదం చేస్తుందన్నారు. అలాగే భవన నిర్మాణ మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సమావేశానికి హాజరైన 50 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. ఏఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని గుత్తుల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుని శ్రీపుష్పోత్సవం



శ్రీపుష్పోత్సవం సందర్భంగా దంపతి తాంబూలాలు అందుకుంటున్న దంపతులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3 వేల మందికి భారీ అన్నసమారాధన జరిగింది. రాత్రి బృందావనం సత్యనారాయణాచార్యులు, సంపర గోపాలాచార్యులు, అంగర ప్రభాకరాచార్యుల బ్రహ్మత్వంలో శ్రీ పుష్పోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దంపతులకు దంపతి తాంబూలాలు అందించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత–సత్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ తుమ్మూర సుబ్బలక్ష్మి–రాంబాబు దంపతులు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి–రాధాకృష్ణ దంపతులు, సొసైటీ చైర్మన్ పలివెల నాగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యతతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ

కె.గంగవరం: పూర్తి స్థాయి నాణ్యతతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఎంపీటీసీ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని కూళ్ల శివారు ఎస్సీ కాలనీ వద్ద సుమారు రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని త్వరలో గ్రామంలో పలుచోట్ల రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కోరికను కూడా నెరవేరుస్తామని పేర్కొన్నారు.